## పారదర్శకంగా బార్ల లైసెన్స్‌దారుల ఎంపిక



డ్రా ప్రక్రియను చేపడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎక్సైజ్ అధికారులు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 29:జిల్లాలో మూతబడిన రెండు బార్ల లైసెన్స్‌దారుల ఎంపికను లాటరీ పద్ధతి ద్వారా పారదర్శకంగా చేపట్టినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. రెండు బార్ల లైసెన్స్‌దారుల ఎంపిక కోసం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ప్రక్రియలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మూతబడిన రెండు 2బీ బార్ల కోసం 112 మంది అభ్యర్థుల ద్వారా 145 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుదారుల సమక్షంలో పారదర్శకంగా లాటరీ పద్ధతిన ఎంపికలు చేపట్టామని వివరించారు. ఎంపికైన వారు ప్రభుత్వం నిర్దేశించిన ఎక్సైజ్ టాక్స్ వెంటనే చెల్లించి కన్ఫర్మేషన్ లెటర్ తీసుకోవాలని సూచించారు. ఎక్సైజ్ అధికారులు జనార్దన్‌రెడ్డి, నాగంద్రరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక


ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

కొణిజర్ల, ఏప్రిల్ 29: మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీజ మంగళవారం తనిఖీ చేశారు. నిబంధనలకు లోబడి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందా.. లేదా.. అనే అంశాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల పేరిట గతంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కుటుంబసభ్యుల పేర ట్రాక్టర్, నాలుగు చక్రాల వాహనాలు, వారి ఆర్థిక స్థితిగతులు, ప్రాధాన్యత క్రమంలో పరిశీలించాలన్నారు. రేకులు, పూరిగుడిసెల్లో నివసిస్తున్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రోజారాణి, పంచాయతీ సెక్రటరీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం.. రాజ్యాంగ విరుద్ధం'



మాట్లాడుతున్న రాజకీయ పార్టీల నేతలు, ముస్లింలు

రఘునాథపాలెం, ఏప్రిల్ 29: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ–2025 చట్టం రాజ్యాంగ విరుద్ధమని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఖమ్మం యూనిట్ బాధ్యులు మౌలానా మహ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మీ పేర్కొన్నారు. ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలనే డిమాండ్‌లో భాగంగా ఖమ్మం యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 9 గంటల నుంచి 9:10 గంటల వరకు గృహ, వాణిజ్య సముదాయాల్లో విద్యుత్ లైట్లు ఆర్పి వేసే నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఖమ్మంలోని టీఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము చేపట్టిన రెండో దశ ఉద్యమానికి ఖమ్మంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, మాస్‌లైన్, బీఎస్పీ సహా పలు రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సంఘం బాధ్యులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కబడ్డీ జట్టుకు వేణుఅభినయ్

వైరాటౌన్, ఏప్రిల్ 29: ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న జరిగిన రాష్ట్ర జూనియర్ బాలుర జట్టుకు న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థి ఎక్కిరాల వేణుఅభినయ్ ఎంపిక అయ్యాడని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రం తరపున కర్ణాటకలోని నాగపూర్‌లో అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు పాల్గొన్నారు.

## పశు వైద్యశిబిరం

మధిర, ఏప్రిల్ 29: మండలంలోని రాయపట్నం, రొంపిమళ్ల గ్రామాల్లో మధిర పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్యసహాయక సిబ్బంది రైతులకు లేగదూడల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ లైఫ్‌స్టాక్ ఆఫీసర్లు రఫీఅహ్మద్, లక్ష్మణరావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు కొండలరావు, కిరణ్, సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## సుశీలమ్మ కుటుంబాన్ని పరామర్శించిన లింగాల

బోనకల్లు, ఏప్రిల్ 29: మండలంలోని రాయన్నపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తూము సుశీలమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మంగళవారం రామన్నపేట వెళ్లి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో నాయకులు బంధం శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, పారా ప్రసాద్, వల్లెబోయిన కొండలరావు, రాధాకృష్ణ, సాయిబాబు ఉన్నారు.

## అర్జున్‌కు నివాళి

కూసుమంచి(నేలకొండపల్లి), ఏప్రిల్ 29: మండలంలోని చెరువుమాదారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తెల్లగోర్ల లింగస్వామి తండ్రి అర్జున్ మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య చెరువుమాదారం వెళ్లి అర్జున్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢడ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో నాయకులు నాగుబండి శ్రీనివాసరావు, మరికంటి రేణుబాబు, షేక్ మస్తాన్, ప్రవీణ్, ప్రసాద్, రామారావు, ఎల్లయ్య, లింగస్వామి, వీరబాబు, బద్రీ, అనీల్ తదితరులు ఉన్నారు.

## నేడు సింగరేణి హెడ్‌ఆఫీస్ ఎదుట ధర్నా

సత్తుపల్లి, ఏప్రిల్ 29: జేఏసీ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, వైద్య సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట బుధవారం జరిగే దీక్ష, ధర్నాను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీ) అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(పీఎస్‌సీడబ్ల్యూ), సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(ఎస్ఎస్‌సీకేఎస్) నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కిష్టారం ఓసీ, సమంత క్యాంప్‌లో ప్రచారం చేసి గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎస్‌సీడబ్ల్యూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అమర్లపూడి శరత్, ఎస్ఎస్‌సీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బీ.మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక పెద్ద పరిశ్రమగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను నిరంతరం దోపిడి చేస్తున్నారని, కార్మిక చట్టాలను సింగరేణిలో అమలు చేయడం లేదని, కోల్ ఇండియా ఒప్పందం రావాల్సిన హైపవర్ కమిటీ వేతనాలను సైతం అమలు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు ఒక్కపైసా కూడా పెరగలేదని, ఈ క్రమంలో సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యమై కొత్తగూడెం హెడ్‌ఆఫీస్ ముందు నిరసన దీక్ష, ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో రవి, వెంకటేష్, కట్ల ప్రసాద్, గిగా సురేష్, ప్రకాశ్, నగేష్, శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# కాంగ్రెస్ నాయకులు. నోరు అదుపులో పెట్టుకోవాలి

- కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను విమర్శించే అర్హత ఖమ్మం నాయకులకు లేదు
- కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ పాలనలోనే ఖమ్మం అభివృద్ధి: పగడాల, కర్నాటి తదితరులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పగడాల నాగరాజు, కార్పొరేటర్లు, తదితరులు

ఖమ్మం, ఏప్రిల్ 29: ఖమ్మం కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. అధికారం ఉంది కదా అని నోటికేది వస్తే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడల నాగరాజు, కేఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ టీడర్ మక్బుల్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరులు మాట్లాడారు. లక్షలాది జనంతో బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైతే ఖమ్మం కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేక పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను, అజయ్‌ను బొందపెట్టారంటూ కాంగ్రెస్‌లోకి వెళ్లిన కార్పొరేటర్ కమర్తపు మురళి మాట్లాడడం అత్యంత నీచంగా ఉందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రుణాలు ఇవ్వబోమంటూ కేఎంసీ డివిజన్ల ప్రజలను కాంగ్రెస్ నాయకులు ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చారని అన్నారు. దీనిని కాంగ్రెస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని అన్నారు. హామీలు అమలుచేయడం చేతకాని కాంగ్రెస్ నాయకులు.. కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవాచేశారు. రూ.వేల కోట్ల నిధులు తెచ్చి ఖమ్మాన్ని అభివృద్ధి చేసిన ఘనత పువ్వాడ అజయ్ కుమార్‌దేనని స్పష్టం చేశారు. తీగల వంతెనకు రూ.180 కోట్లు, కరకట్ట నిర్మాణానికి రూ.800 కోట్లు ఇచ్చింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెచ్చిన నిధులెన్నో, చేసిన పనులేమిటో చూపాలని డిమాండ్ చేశారు. 2016కు ముందు కమర్తపు మురళి బట్టల వ్యాపారం చేసుకునేవారని గుర్తుచేశారు. అప్పట్లో తుమ్మలకు కేసీఆర్ మంత్రి పదవి ఇచ్చాక తుమ్మల ద్వారా బీఆర్ఎస్‌లోకి వచ్చిన కమర్తపు మురళి.. పార్టీ నగర అధ్యక్షుడు అయ్యాడని, ఆ తరువాత అజయ్ మంత్రిగా ఉన్నప్పుడు కూడా మరోసారి నగర అధ్యక్షుడు అయ్యాడని గుర్తుచేశారు. రెండుసార్లు కేసీఆర్ ఫొటో పెట్టుకొని కార్పొరేటర్ అయిన కమర్తపు మురళి.. ఇప్పుడు బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను విమర్శించడమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని విమర్శించారు. కమర్తపు మురళికిగానీ, బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఇతర కార్పొరేటర్లకుగానీ ధైర్యముంటే వెంటనే కార్పొరేటర్ల పదవులకు రాజీనామా చేసి హస్తంపై మళ్లీ గెలిచి మాట్లాడాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు పసుమర్తి రామ్మోహన్‌రావు, బుర్రి వెంకట్, దండా జ్యోతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆరెంపుల వీరభద్రం, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహాత్మా బసవేశ్వర జయంతి: కలెక్టర్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 29:శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీమహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

## 5న పీపీటీ టాలెంట్ టెస్ట్

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 29: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మే 5న పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ (పీపీటీ) టాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు రంజాన్, నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ పరీక్ష రాసే అర్హత ఉందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

## 'ఆందోళనలు ఉధృతం చేస్తాం'



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 29: ప్రభుత్వం దొడ్డిదారిన తెచ్చిన జీవో నంబర్ 21ని ఉపసంహరించుకునే వరకూ తమ ఆందోళనలను నిలిపేది లేదని కాకతీయ యూనివర్సిటీ పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులు స్పష్టం చేశారు. మరింత ఉధృతం చేస్తామని తేల్చిచెప్పారు. కళాశాలలో చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న అధ్యాపకులు గోపి, శ్యాంబాబు, వీరన్న మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 21ని తెచ్చి తమ జీవితాలను ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. దీక్షలో కోటి, రవిబాబు, వీరాంజనేయులు, జగ్జీవన్‌రావు, శ్రీనివాస్, లక్ష్మీహరిత, రమ, నరసింహానాయక్ పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కార వేదిక భూ భారతి

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి(నేలకొండపల్లి), ఏప్రిల్ 29: భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని సుర్దేపల్లి గ్రామంలో జరిగిన భూభారతి చట్టం–2025 అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి మంత్రి హాజరయ్యారు. నూతన భూ భారతి చట్టం ద్వారా భూములకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నేలకొండపల్లి మండలంలో 23రెవెన్యూ గ్రామాల్లో 20 సదస్సులు పూర్తయ్యాయని, నేటి వరకు 2380 దరఖాస్తులు వచ్చాయన్నారు. జూన్ 2వ తేదీలోపు ఎంపిక చేసిన నాలుగు పైలెట్ గ్రామాల భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం భూపరిపాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ ధరణీ స్థానంలో భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహరావు, ఏడీ అగ్రికల్చర్ బీ సరిత, ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతగా ప్రజాప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం నేలకొండపల్లి మండలం నాచెపల్లి గ్రామంలో కొత్త కొత్తూరు నుంచి వల్లబి వరకు రూ.40లక్షలతో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులకు, సూర్దెపల్లి నుంచి కిష్టారం హైలెవల్ బ్రిడ్జి వరకు రూ.35లక్షలతో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నేలకొండపల్లి ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకూబ్, ఈఈ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు చర్యలు సరికాదు: బెల్లం


కూల్చివేసిన స్థల నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 29: అధికారం ఎవరికి శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యంలో కక్ష్యసాధింపు చర్యలు సరికావని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట ఇందిరమ్మ కాలనీలో అధికారులు కూల్చివేసిన ఇంటి నిర్మాణ స్థలాన్ని ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ప్లాట్‌కు సంబంధించిన వివరాలను బాధితుడు మేకల ఉదయ్‌తో పాటు ఆ ప్రాంతవాసులను అడిగితెలుసుకున్నారు. జరిగిన ఘటనపై మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ పీ రాంప్రసాద్‌ను అడిగి తెలుకుంటానని ఆయన కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధితుడు ఉదయ్ మాట్లాడుతూ తాను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. గతంలో నాయుడుపేట వాసికి ఇందిరమ్మ ఇళ్ల స్థలం కెటాయించారని, అయితే అతనితో పాటు మరికొందరు ప్లాట్లు రోడ్డు విస్తరణలో పోవడంతో నాటి రెవెన్యూ అధికారులు ప్రత్యామ్నాయంగా వేరే ప్రదేశాన్ని చూపించడం జరిగందన్నారు. అట్టి స్థలాన్ని తాను కొనుగోలు చేసి, ఇంటి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కేవలం బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్‌గా పని చేస్తున్నందునే తనపై పథకం ప్రకారం కక్షకట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అన్యాయంపై పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శీలం రవికుమార్, కనకయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 29: ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఏదులాపురం మున్సిపల్ కమిషన్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, రూరల్ తహసీల్దార్ పీ రాంప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం నాయుడుపేట ఇందిరమ్మ కాలనీ సర్వే నెంబర్142లోని ప్రభుత్వ భూమిలో అక్రమ ఇంటి నిర్మాణం చేపడుతుండగా వారు సిబ్బందితో వచ్చి జేసీబీ సహాయంతో కూల్చి వేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలను కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వం నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఆర్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలి

ముదిగొండ, ఏప్రిల్ 29: కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాలు వేసి లోడ్ చేయడం లేదని రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని గోకినేపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. రైతులు తమ పొలాల నుంచి ధాన్యం తీసుకువచ్చి ఇక్కడ ఆరబోశారు. 80 మంది రైతులకు రసీదులు ఇచ్చినా కాటాలు వేయటం లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సునీత ఎల్లైబిత్ కొనుగోలు కేంద్రానికి వచ్చి రైతులతో మాట్లాడారు. సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## కుట్టుమిషన్లు వితరణ

వైరాటౌన్, ఏప్రిల్ 29: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డీజేఎస్ లయన్ లగడపాటి ప్రభాకర్‌రావు పుట్టినరోజు సందర్భంగా వైరాకి చెందిన వేముల వెంకటలక్ష్మి, పతంగి మౌనికకు కుట్టుమిషన్లు అందించారు.

## నవతరం ఆధ్వర్యంలో రమ్యకు సన్మానం


రమ్యను సన్మానిస్తున్న నవతరం సభ్యులు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 29: ఇటీవల ఇంటర్ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించిన మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బూసుపల్లి ఈశ్వర్‌రెడ్డి, సరళ కుమార్తె రమ్యను నవతరం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. నవతరం అధ్యక్షుడు కోట లోకేష్ మాట్లాడుతూ ప్రతిఒక్క విద్యార్థి కష్టపడి చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో నవతరం గౌరవ అధ్యక్షుడు మందుల సామేలు, అధ్యక్షుడు కోట లోకేష్, ప్రధాన కార్యదర్శి మేకల రమేశ్, ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు, కోశాధికారి సగుర్తి ముత్యాలరావు, సభ్యులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జ్యోతి అమూల్యకు సన్మానం


జ్యోతిఅమూల్యను సన్మానిస్తున్న మల్లూరి

సత్తుపల్లి, ఏప్రిల్ 29: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన గోళ్ల కళాధర్ కుమార్తె జ్యోతి అమూల్య ఇంటర్‌లో 993/1000 మార్కులను సాధించింది. మంగళవారం ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రముఖ వ్యాపారవేత్త మల్లూరి సూర్యనారాయణ జ్యోతిఅమూల్యను శాలువాలతో సత్కరించి మెమోంటో అందజేశారు. మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో చేరుకోవాలని, తన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు సరబు శివనాద్‌ప్రభు, సెక్రటరీ గోళ్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి అడపా రవికుమార్, రాము ఉన్నారు.

## బోనకల్లు ఎస్సైగా వెంకన్న


పొదిల వెంకన్న

బోనకల్లు, ఏప్రిల్ 29: బోనకల్లు పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పొదిల వెంకన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన పీ.మధుబాబును ఖమ్మం సీపీ సునీల్‌దత్ బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకన్నను బోనకల్లు ఎస్సైగాను, బోనకల్లులో ఎస్సైగా పనిచేసిన మధుబాబును ఖమ్మం సీఏఆర్‌కు బదిలీ చేశారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 29: ఎన్నికల మందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట హనుమాన్‌గుడి సెంటర్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీదేవికి నాయకులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, సుదర్శన్ రెడ్డి, యర్రా శ్రీనివాస్ మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ నేటి వరకు అమలు చేయలేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నంద్రా ప్రసాద్, పీ మోహన్‌రావు, నందిగామ కృష్ణ, ఏటుకూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మధిర ఇండోర్‌స్టేడియంలో కబడ్డీ, బ్యాడ్మింటన్‌పై శిక్షణ


మాట్లాడుతున్న క్రీడల శిక్షకులు

మధిర, ఏప్రిల్ 29: మధిర పరిసర ప్రాంత విద్యార్థినీ, విద్యార్థులకు, క్రీడాకారులకు మధిర పట్టణంలోని ఇండోర్‌స్టేడియంలో సింథలిక్ మ్యాట్‌పై కబడ్డీ, బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మధిర ఇండోర్‌స్టేడియం అడ్మినిస్టేటర్ కమ్ ఇన్‌చార్జి వై.చిన్న తెలిపారు. మే 1 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వేసవి శిబిరాలు పిల్లలకు శారీరక ఫిట్‌నెస్, సృజనాత్మకను పెంచుకోవడానికి సహాయపడతాయని ఎంఈవో వై.ప్రభాకర్ అన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు పీడీ వై.చిన్ని(98491 25569), కబడ్డీ కోచ్ కే.ప్రవీణ్‌కుమార్(9866657209), బ్యాడ్మింటన్ కోచ్ సునీల్(85230 67614) సంప్రదించాలని కోరారు.

## గ్యాస్ సిలిండర్ లీకై అంటుకున్న మంటలు

### ప్రమాదంలో ఇద్దరు మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు


తరుణ్(ఫైల్)


సుశీల(ఫైల్)

పెనుబల్లి, ఏప్రిల్ 29: వంట గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో మంటలు అంటుకొని ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతిచెందగా.. మరో నలుగురు తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటన తల్లాడ మండలం పాతమిట్టపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుత్తికొండ వినోద్ తన ఇంట్లో సోమవారం రాత్రి వంట గ్యాస్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌కు రెగ్యులేటర్‌ను అమర్చాడు. అయితే దానిని సరిగా అమర్చకపోవడంతో గ్యాస్ లీకేజీ అయింది. దీనిని గమనించకపోవడంతో గ్యాస్ పరిసర ప్రాంతాలకు వ్యాపించడం.. అక్కడే వాటర్ హీటర్ పెట్టి ఉండడం.. కట్టెల పొయ్యి రగులుతుండడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగతో ఇంటిని అలుముకున్నాయి. అదే సమయంలో ఇంట్లో ఉన్న వినోద్‌తోపాటు అతడి పిల్లలు తరుణ్(8), వరుణ్, వినోద్ చెల్లెలి పిల్లలు ప్రిన్సీ, లింసీ, వినోద్ నాయనమ్మ సుశీల(70) మంటల్లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే గమనించిన స్థానికులు, హమాలీలు గోనె సంచులతో మంటలను అదుపు చేసి గాయపడిన వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరుణ్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సుశీల(70) మృతిచెందింది. కాలిన గాయాలతో కొట్టుమిట్టాడుతున్న మిగిలిన వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాల్సిందిగా వైద్యులు సూచించినట్లు సమాచారం. గ్రామస్తులు దాతల సహాయం కోసం ప్రయత్నం చేస్తున్నారు. కాగా.. వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చిన మేనత్త పిల్లలతో కలిసి పగలంతా ఆడిపాడి.. సాయంత్రం స్నానం చేసి ఇంట్లోకి అడుగు పెట్టిన వెంటనే ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో మంటల్లో చిన్నారులు పెట్టిన ఆర్తనాదాలు ప్రతీ ఒక్కరికి కన్నీరు తెప్పించాయి.

## ఖమ్మం రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు


ఖమ్మం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

మామిళ్లగూడెం, ఏప్రిల్ 29: కేంద్ర నిఘా వర్గాల సమాచారం, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఖమ్మం రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్‌పీఎఫ్ సీఐ బుర్రా సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఖమ్మం రైల్వేస్టేషన్‌లోని సర్క్యులేటింగ్ ఏరియా, ప్లాట్‌ఫారాలు, రైళ్లు, యార్డులు, ఇతర కీలక ప్రాంతాల్లో మంగళవారం సమగ్ర తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు, బ్యాగులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఆర్‌పీఎఫ్ అధికారులు మోడిస్సా, ప్రసన్నకుమార్, రమేష్, రామారావు, మదన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడి మృతి


గుండ్ర వీరస్వామి(ఫైల్)

పెనుబల్లి, ఏప్రిల్ 29: కల్లూరు మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న గుండ్ర వీరస్వామి(54) మంగళవారం ఉదయం తిరువూరు నుంచి ద్విచక్ర వాహనంపై కల్లూరు వస్తుండగా ముగ్గు వెంకటాపురం వద్ద కోతులు అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో అతనికి బలమైన గాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య జమలమ్మ, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిత తెలిపారు. పలువురు ప్రముఖులు వీరస్వామి భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం, సానుభూతి తెలిపారు.

## అదుపు తప్పి లారీ బోల్తా

పెనుబల్లి, ఏప్రిల్ 29: ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. మండలంలోని లంకాసాగర్ గ్రామం వద్ద ఉన్న రైస్‌మిల్‌కు పాతకారాయిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో వస్తుండగా రైస్‌మిల్‌కు దగ్గరలో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీలోఉన్న ధాన్యం బస్తాలు మొత్తం కింద పడిపోయాయి. రైస్‌మిల్ వద్ద భారీగా లారీలు రోడ్డుపై నిలిచిపోయి ఉండడంతో వాటిని తప్పించేందుకు పక్కకు వెళ్తుండగా లారీ బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు.

## మొక్కజొన్న కంకి దగ్ధం

బోనకల్లు, ఏప్రిల్ 29: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఓ రైతుకు చెందిన మొక్కజొన్న కంకి ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమైంది. సమీప రైతులు మొక్కజొన్న పైరు వ్యర్థాలకు నిప్పంటించడంతో అది కాలుకుంటూ అల్లిక లక్ష్మీనారాయణకు చెందిన 30 క్వింటాళ్ల మొక్కజొన్న కంకికి నిప్పంటుకొని పూర్తిగా కాలిపోయింది. దీంతో రైతుకు సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదం

ముదిగొండ, ఏప్రిల్ 29: విద్యుత్ అధికారుల నిర్యక్ష్యం వల్ల మంగళవారం పెను ప్రమాదం చోటుచేసుకున్నది. మండలంలోని పెద్దమండవ గ్రామంలో ఎల్సీ తీసుకోకుండా అధికారులు 32 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేస్తున్నారు. విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి పఠాన్ హుస్సేన్‌మియా ఇంట్లోకి హై ఓల్టేజ్ విద్యుత్ ప్రసరించి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో భయాందోళనకు గురైన హుస్సేన్‌మియా కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలిపోయిందనీ ఆవేదన వ్యక్తం చేశారు.